క్లుప్తంగా

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

సైదాపురం: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఆయన శనివారం వేములచేడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. అనంతరం పాలూరు, సైదాపురంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

చిట్టమూరు : మండలంలోని పిట్టివానిపల్లికి వెళ్లే రోడ్డు సమీపంలో శనివారం కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు.. మల్లాం నుంచి కొత్తగుంట వైపు కారు వెళుతోంది. పిట్టివానిపల్లికి వెళ్లే రోడ్డు సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తుమ్మచెట్టును ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. గాయపడిన డ్రైవర్‌ను స్థానికులు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్టు వాసికి డాక్టరేట్

చిట్టమూరు : మండలంలోని మెట్టు గ్రామానికి చెందిన షేక్ జిలానీ బాషాకు అమెరికాకు చెందిన కేమ్ బ్రిడ్జ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఢిల్లీలోని హాలిడే ఇన్ ఫైవ్‌స్టార్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. తాను చేసిన సమాజ సేవలను గుర్తించి డాక్టరేట్ అందజేసినట్టు జిలానీ బాషా తెలిపారు. ఆయనను మెట్టు గ్రామస్తులు అభినందించారు.

కార్మికులకు న్యాయం చేయాలి

పెళ్లకూరు: మండలంలోని పునబాక వైష్ణవి డెయిరీలో పనిచేస్తూ కంపెనీ మూసేయంతో వీధిన పడిన కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు శివకవి, ముకుంద డిమాండ్ చేశారు. వారు శనివారం కంపెనీ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ డెయిరీ మూసివేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. కొత్తగా కంపెనీ బాధ్యతలను చేపట్టిన యాజమాన్యం కార్మికులకు వేతనాల బకాయిలు చెల్లించి, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

బాలికలపై వివక్ష చూపొద్దు

వెంకటగిరి రూరల్ : సమాజంలో బాలికలపై వివక్ష చూపకుండా బాలురితో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించేలా చూడాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేశారు. ఆడపిల్లలను చదువుల్లో ప్రోత్సహించాలన్నారు.

రీ సర్వేకి సహకరించండి

చిల్లకూరు : కడివేడు రెవెన్యూ పరిధిలోని భూములను సోమవారం నుంచి రీ సర్వే చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం కడివేడు సచివాలయంలో రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కడివేడు రెవెన్యూలోని కడివేడు, కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం గ్రామాల్లో 7,760 ఎకరాల భూములు రీసర్వేచేయాల్సి ఉందని తెలిపారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి కల్యాణం

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని శనివారం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి కల్యాణం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవను నేత్రపర్వంగా చేపట్టారు.

పల్లె పండుగకు పైసల్లేవు



పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించి ఎంతోకొంత వెనకేసుకోవచ్చని కూటమి నేతలు భావించారు. పనులు చేసి రెండు నెలలు పూర్తవుతున్నా బిల్లులు మంజూరు కాలేదు. ఎప్పుడు వస్తాయో కూడా తెలియక లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు అప్పు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.



పల్లెపండుగలో వేసిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు,



శిలాఫలకం వదిలేసిన రోడ్డు

- రెండు నెలలుగా ఆగిన బిల్లులు
- లబోదిబోమంటున్న కూటమి నేతలు
- వడ్డీలు పెరిగి పోతాయని ఆవేదన

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇసుక, మట్టి తరలిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అంతటితో ఆగక పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రోడ్లు, కాలువ పనులు అప్పగించారు. తద్వారా వారికి మేలు చేయాలని భావించారు. ప్రతి మండలానికి రూ.కోట్లు మంజూరు చేశారు. చిల్లకూరు మండలానికి రూ.2.73 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటితో 54 పనులు చేయాలని ఆదేశించింది. అలాగే గోకులం పేరుతో పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించింది. పనులను తమ కార్యకర్తలకే అప్పగించేలా చర్యలు తీసుకుంది. పనులు దక్కించుకున్న కూటమి నాయకులు ప్రతి గ్రామంలోనూ కనీసం ఒక పని రూ.5 లక్షలకు తక్కువ కాకుండా నిధులు మంజూరు చేయించుకుని పనులు మొదలు పెట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి బిల్లులు మంజూరు చేసుకుని కొంత ఆదాయం పొందవచ్చని అనుకున్నారు. ఇందుకు కొంతమంది తమ వద్ద పెట్టుబడి లేకపోయినా బయటి వ్యక్తుల నుంచి అప్పు తెచ్చి పనులు చేశారు. రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. దీంతో కూటమి నేతలు ఉపాధి కార్యాలయం చుట్టూ తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఇంత ఆలస్యం చేస్తే భవిష్యత్తులో పనులు ఎలా చేయగలమని మరికొందరు బాహాటంగా విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల చెల్లింపుల్లోనూ ఇంత ఆలస్యం చేయడం ఎంత వరకు సబబని వారు ప్రశ్నిస్తున్నారు.

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల పనులు పలు గ్రామాల్లో పూర్తయ్యాయి. వాటికి తొలి నెలలో కొంత మందికి బిల్లులు చెల్లించాం. రెండు నెలలుగా బిల్లులు మంజూరు కాలేదు. జిల్లా కలెక్టర్ పలుమార్లు పల్లె పండుగపై సమీక్షించి త్వరగా బిల్లులు చెల్లించేలా చూస్తామని తెలిపారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేయించాలని ఆదేశించారు. వాటిని కూడా త్వరలో పూర్తి చేసి బిల్లులు చెల్లిస్తాం.

– ఇలియాజ్, పీఆర్ ఏఈ, చిల్లకూరు

సచివాలయం తనిఖీ

చిట్టమూరు : సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆదేశించారు. ఆయన శనివారం ఆరూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీని, సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శంకర్, కరీముల్లా, స్వప్న పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

నాయుడుపేట టౌన్ : ముస్లిలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్‌మాస ఉపవాస ప్రార్థనలు శనివారం రాత్రి తరాబి నమాజులతో ప్రారంభమైనట్టు జామీయా మసీదు మత పెద్దలు ప్రకటించారు. రంజాన్ మాసం నెలవంకను చూసిన ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని మసీదుల్లో తరాబి ప్రత్యేక నమాజు చేపట్టారు. ఆదివారం నుంచి ఇఫ్తార్‌తో పాటు నమాజు చేయనున్నట్టు తెలిపారు.

టోల్ ప్లాజా వద్ద అఘోరి హల్‌చల్

చిల్లకూరు : మండలంలోని బూదనం టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి ఒక అఘోరి గోవులు, గేదెలను తరలిస్తున్న లారీలను అడ్డుకుని హల్ చల్ చేశారు. కొంతమంది రైతులు చెన్నై నుంచి విజయనగరానికి గోవులు, గేదెలను లారీల్లో తరలిస్తున్నారు. బూదనం టోల్ ప్లాజా వద్ద ఒక అఘోరీ లారీలను అడ్డుకున్నారు. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో అక్రమంగా గోవులను తరలిస్తున్నారని రభస చేశారు. తాము రైతులమని , పాడి కోసం తీసుకెళుతున్నట్టు చెప్పినా వినలేదు. దీంతో అక్కడ కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తర్వాత అఘోరి అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీనిపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

చిల్లకూరు/బాలాయపల్లి(సైదాపురం)/ఓజిలి/దక్కిలి: గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని, చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తే ఎరువులు తయారు చేసి సంపద సృష్టించవచ్చని గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ, చిల్లకూరు ఈవోపీఆర్డీ సిరాజ్, ఓజిలి ఎంపీడీవో విజయలక్ష్మి, దక్కిలి ఈవోపీఆర్డీ అల్లాబక్షు తెలిపారు. బాలాయపల్లి, చిల్లకూరు, ఓజిలి, దక్కిలి మండలాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌పీవో వెంకటరమణ బాలాయపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చిల్లకూరు ఈవోపీఆర్డీ సిరాజ్ పొన్నవోలులో, ఓజిలిలో ఎంపీడీవో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీకపోస్టు తయారు చేస్తే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో బాలాయపల్లి ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, ఓజిలి వెల్ఫేర్ అసిసెంట్ ప్రసన్న, ఏఎన్ఎం చందన పాల్గొన్నారు.



బాలాయపల్లిలో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీవో వెంకటరమణ

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



వెంకటగిరి రూరల్ : విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి(సైదాపురం)/రాపూరు/దక్కిలి/గూడూరు రూరల్/వాకాడు : వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో శనివారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వెంకటగిరిలోని విశ్వోదయ, ఏపీఆర్‌జేసీ, ఎన్‌బీఎన్, రాపూరులోని ప్రభుత్వ జూనియర్, దక్కిలిలోని అంబేడ్కర్ గురుకుల, గూడూరు పట్టణంలోని ఎస్‌కేఆర్, డీఆర్‌డబ్ల్యూ, నారాయణ, స్వర్ణాంధ్రభారతి, సెయింట్ మేరీస్, వాకాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేశారు. వెంకటగిరిలో 1,219 మందిలో 57 మంది, రాపూరులో 235 మందిలో 23 మంది, దక్కిలిలో 136 మందికి గాను నలుగురు, గూడూరులో 1221 మంది గాను 39 మంది, వాకాడులో 390 మందికి గాను 19 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష సెంటర్లకు చేరుకున్నారు. వెంకటగిరి సీఐ ఏవీ రమణ విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసి ఆల్ ది బెస్ట్ తెలిపారు. అలాగే గూడూరులోని పరీక్ష కేంద్రాలను డీఎస్పీ గీతాకుమారి, సీఐలు శేఖరబాబు, శ్రీనివాసులు పరిశీలించారు.



రాపూరులో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు



గూడూరు రూరల్ : నారాయణ కళాశాల వద్ద విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న పోలీసులు



గూడూరు రూరల్ : పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి

ఐటీడీఏ దృష్టికి మోపూరు భూ సమస్య

వెంకటగిరి రూరల్ : డక్కిలి మండలం మోపూరు గ్రామంలోని గిరిజనుల భూ సమస్యను ఐటీడీఏ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. వెంకటగిరిలోని నాగేశ్వరి ఫంక్షన్ హాల్‌లో శనివారం గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోపూరు గిరిజనులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిలోకి ఫారెస్టు అధికారులు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. అటవీ భూముల ఆక్రమణదారులకు తొత్తుగా వ్యవహరిస్తున్న డీఆర్వో ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరారు.

ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబాలు పటిష్టం

చిల్లకూరు : ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబాలు పటిష్టమవుతాయని షార్ విశ్రాంత ఉద్యోగి, లయన్స్ క్లబ్ సభ్యుడు పసుపులేటి ప్రసాద్ తెలిపారు. గూడూరులోని సునీతా సేవా సంస్థ కార్యాలయంలో శనివారం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చేతివృత్తులు నేర్చుకుని కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



గూడూరులో విద్యా సామగ్రి పంపిణీ..



వెంకటగిరిలో..

గూడూరు రూరల్ : గూడూరు మండలం చెన్నూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రగతి సేవా సంస్థ విద్యా సామగ్రి అందజేసింది. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సంస్థ సభ్యుడు విజయకుమార్, హెచ్ఎం మములాజాన్, వీణాపాణి, కల్పన, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మన బడి- మన మిత్రులు, పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం వి.లత, ఉపాధ్యాయులు చెంచురత్నం, పూర్వ విద్యార్థులు జి.ఢిల్లీబాబు, లక్కమనేని రవీంద్ర, సుబ్బారావు, పకీరుగారి శ్రీహరి మురళీ, తిరుమలశెట్టి వల్లభదాసు, సుంకర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం లీలాకుమార్ తెలిపారు. పాఠశాలలో శనివారం సరస్వతి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వివరించారు. అనంతరం అర్చకులు నాగరాజస్వామి పిల్లలతో సరస్వతి పూజ చేయించి ప్యాడ్స్, పెన్నులు అందజేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : మండలంలోని అన్నమేడు పాఠశాల విద్యార్థులకు పలువురు దాతలు విద్యా సామగ్రి అందజేశారు. పాఠశాలలో వంటశాల నిర్మాణానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో దువ్వూరు కుమార స్వామి రెడ్డి, ఆనందకుమార్ రెడ్డి, కే సూర్యప్రకాష్, విష్ణువర్ధన్ రెడ్డి, విజయమోహన్ రెడ్డి చిగురువాడ పద్మ నాభం, హెచ్ఎం మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



సోమశేఖర్‌రెడ్డికి పరామర్శ



సోమశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డిని శనివారం ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల సోమశేఖర్ రెడ్డి వెళుతున్న కారు ఎగువ చావలి వద్ద బోల్తా పడింది. ఈ క్రమంలో చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. బాలాజీ, సారథి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

వెంకటగిరి రూరల్ : మండలంలోని పాళెంకోట రెవెన్యూ పరిధిలో వున్న ప్రభుత్వ భూమిని శనివారం కూటమి నేతలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ పాళెంకోట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4, 5, 7, 8లో ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలంతా కలిసి సాగుకు సిద్ధం చేసుకున్నామని తెలిపారు. కూటమి నేతలు దాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై తహసీల్దార్ రాంబాబు వివరణ ఇస్తూ పాళెంకోటలో ఉన్నది అటవీభూమి అని తెలిపారు. అందులోకి ఎవరూ వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

చెడు వ్యవసనాలతో జీవితాలు దుర్భరం

చిల్లకూరు : చెడు వ్యసనాలతో జీవితాలు దుర్భరంగా మారతాయని, యువతకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఆమె శనివారం తన కార్యాలయంలో యువతకు ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా వేధింపులు తదితరాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కొంతమంది క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడుతుంటారని తెలిపారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో చర్చిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

వెంకటగిరి రూరల్/వాకాడు/చిల్లకూరు : పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని వెంకటగిరి, వాకాడు, గూడూరు పశుసంవర్ధక శాఖ అధికారులు స్వామిబాబు, రమణయ్య, సురేష్ తెలిపారు. వారు శనివారం వెంకటగిరి పట్టణం బొగ్గులమిట్ట, వాకాడు, గూడూరు మండలం చెన్నూరులో పశువులకు టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులకు ఈ నెలాఖరు వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట జాతీయ రహదారి నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు చేపట్టిన సాగరమాల రోడ్డు వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటుచేయాలని రైతులు కోరారు. వారు శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి వినతి పత్రం అందజేశారు. సాగరమాల రోడ్డు వల్ల తాము భూముల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా ఉందన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.